## లక్ష్మీనరసింహుడికి లక్ష పుష్పార్చన



స్వామివారికి లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు కాండూరి వేంకటాచార్యులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 29 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని లక్ష పుష్పార్చన పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. గురువారం స్వామి, అమ్మవార్ల సహస్ర నామ పఠనాలతో అర్చకులు, వేద పండితులు వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన పూజలు నిర్వహించారు. స్వయంభూ ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో దివ్యమనోహరంగా అలంకరించారు. వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన పూజలను పాంచరాత్రగమశాస్త్ర ప్రకారం సుమారు రెండు గంటల పాటు కొనసాగించారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. తులసి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలోని కల్యాణ మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హవనం జరిపారు. స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం వైభవంగా సాగింది. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 40,12,733 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

## గుట్టలో ఉత్సాహంగా ఉట్లోత్సవం



ఉట్లోత్సవంలో పాల్గొన్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు త్రయాహ్నిక దీక్షతో ఘనంగా సాగుతున్నాయి. దేవస్థాన గోశాలలో గురువారం గోపూజను వైభవంగా నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామిని దివ్యమనోహరంగా అలంకరించి ఉట్ల సేవోత్సవం చేపట్టారు. పాలు, వెన్నతోకూడిన ఉట్టికి పూజలు చేశారు. ఉట్టితో ఆలయ నిర్వాహకులు, అర్చకులు, సిబ్బంది, చిన్నారులు మాఢవీధుల్లోకి తూర్పు రాజగోపురం ముందుకు చేరుకున్నారు. ఉట్లోత్సవంలో చిన్నారులు, యువత ఉట్టి కొడుతూ ఆనందంగా గడిపారు. రాత్రి ప్రధానాలయంలో రుక్మిణీ కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, ఏఈఓలు రఘు, జూశెట్టి కృష్ణ, పర్యవేక్షకులు రాజన్‌బాబు పాల్గొన్నారు.

## చందుపట్లకు బస్సు ప్రారంభం



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న పీఏసీఎస్ మాజీ చైర్మన్ బాలుగూరు మధుసూదన్ రెడ్డి, గ్రామస్తులు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 29 : మండలంలోని చందుపట్ల గ్రామానికి బస్సు సేవలను గురువారం పీఏసీఎస్ మాజీ చైర్మన్ బాలుగూరు మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఉప్పల్ డిపో మేనేజర్ హరికీర్తి శ్రీనివాస్‌శర్మకు గతంలో విజ్ఞప్తి చేయగా ఆయన మంజూరు చేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ అనునిత్యం పలు పనుల కోసం హైదరాబాద్ వెళ్లే ప్రజల సౌకర్యార్థం ఉదయం సాయంత్రం వేళల్లో కుమ్మరిగూడెం టు చందుపట్ల భువనగిరి మీదుగా సికింద్రాబాద్ వరకు బస్సు సౌకర్యం ఏర్పాటుకు కృషి చేశామన్నారు. ప్రజలు ఆర్టీసీ బస్సు సేవలను సద్వినియోగపరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మందడి లక్ష్మీనరసింహా రెడ్డి, మాజీ సర్పంచ్ చిన్న పాండు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కంకల కిష్టయ్య, మాజీ సర్పంచ్ వలందాస్ ఆదినారాయణ, మాజీ ఎంపీటీసీలు బొక్క కొండల్ రెడ్డి, మాయ బాల నర్సింహ, పిట్టల వెంకటేశ్, చిన్నం వెంకటేశ్, నోముల కృష్ణారెడ్డి, సుబ్బారు శ్రీశైలం, చీదరికంటి సురేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతుల మోటర్ల తొలగింపు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి



చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

వలిగొండ, ఆగస్టు 29 : రైతులు ధర్మారెడ్డిపల్లి కాల్వలో వేసుకున్న విద్యుత్ మోటర్లను తొలగించాలని కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి ప్రభుత్వాన్ని కోరారు. మండల సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డిని కలిసి రైతుల పక్షాన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని వర్కట్‌పల్లి, సంగెం, గోకారం, ప్రొద్దటూర్, ఏదుళ్ల గూడెం గ్రామాల్లోని చిన్న, సన్నకారు రైతులు ధర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి కాల్వల్లో వేసుకున్న విద్యుత్ మోటార్ల కనెక్షన్లు తొలగించాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకునేలా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు ఉపాధి కోల్పోకుండా ప్రభుత్వం చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండే కిష్టయ్య, కవిడె సురేశ్, గూడూరు చిన్న బుచ్చిరెడ్డి, తొర్పునూరి శంకరయ్య, మంగ బాలయ్య, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## దివీస్ సేవలు అభినందనీయం



గోకారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దివీస్ కంపెనీ సహకారంతో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

వలిగొండ, ఆగస్టు 29 : విద్యాభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి చౌటుప్పల్ దివీస్ ల్యాబొరేటరీస్ కంపెనీ అందిస్తున్న సేవలు అభినందనీయమని గోకారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నగేశ్ అన్నారు. మండలంలోని గోకారం, జాలుకాల్వ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 134 మంది విద్యార్థులకు రూ.3,34,446 విలువైన స్కూల్ బ్యాగులు, నోట్స్ బుక్స్, వాటర్ బాటిళ్లను గురువారం దివీస్ కంపెనీ సహకారంతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతమ్మ, సందీప్, సురేందర్, కృష్ణవేణి, దివీస్ యాజమాన్యం ప్రతినిధి సాయికృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మకు బోనాలు



ఆత్మకూరు(ఎం) : పల్లెర్లలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

చౌటుప్పల్, ఆగస్టు 29 : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ముత్యాలమ్మకు గురువారం బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్ల మధ్య అమ్మవారికి మహిళలు పెద్దఎత్తున బోనాలు తీశారు. బోనాలతో బొడ్రాయి చుట్టూ పదక్షిణలు చేశారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాల నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, వార్డు కౌన్సిలర్లు సందగళ్ల విజయసతీశ్‌గౌడ్, దండ హిమబిందు అరుణ్ కుమార్, కామిశెట్టి శైలజా భాస్కర్, బొడిగె బాలకృష్ణ గౌడ్, తొర్పునూరి లింగస్వామి, ఉష్కాగుల నాగరాజు గౌడ్ పాల్గొన్నారు





చౌటుప్పల్ : బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు తదితరులు

**ముత్యాలమ్మకు బోనాలు**

ఆత్మకూరు(ఎం) : మండలంలోని పల్లెర్లలో గురువారం గ్రామస్తులకు ముత్యాలమ్మకు బోనాలు సమర్పించారు. డప్పుచప్పులతో మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## రుణమాఫీ కాని రైతుల వివరాల సేకరణ



రామన్నపేట : ఇంద్రపాలనగరంలో రుణమాఫీ కాని మాజీ ఎంపీపీ పూసబాలమణి కుటుంబసభ్యుల వివరాలను అప్‌లోడ్ చేస్తున్న ఏఓ ఎజాజ్ అలీఖాన్

రామన్నపేట, ఆగస్టు 29 : మండలంలో రేషన్ కార్డులేక రైతు రుణమాఫీ కాని రైతుల వివరాలను గురువారం ఇంద్రపాలనగరం గ్రామంలో ప్రారంభించారు. గ్రామంలో రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి సెల్ఫీ ఫొటోలతో అప్‌లోడ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఎజాజ్ అలీఖాన్, ఏఈఓలు కిరణ్, వెంకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**వలిగొండలో 80 మంది రైతుల వివరాలు అప్‌లోడ్**

వలిగొండ : రేషన్ కార్డులు లేక రుణమాఫీ లబ్ధిపొందని రైతులకు కుటుంబ నిర్ధారణ చేస్తున్నట్లు, మొదటి రోజు సుమారు 80 మంది రైతుల వివరాలను అప్‌లోడ్ చేశామని వలిగొండ మండల వ్యవసాయ అధికారి అంజనీదేవి తెలిపారు. రేషన్ కార్డు లేక రుణమాఫీ పొందని రైతులు దరఖాస్తు ఫారంతో పాటు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్, బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను జత చేసి వ్యవసాయ శాఖ అధికారులకు అందజేయాలని సూచించారు.

**నమోదు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి : ఏడీఏ**

యాదగిరిగుట్ట : రేషన్‌కార్డు లేక రుణమాఫీ నిలిచిపోయిన రైతుల వివరాల నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని వ్యవసాయ సహాయ సంచాలకురాలు శాంతి నిర్మల తెలిపారు. మండలంలోని బాహుపేట గ్రామంలో గురువారం ఆమె నమోదు ప్రక్రియను పరిశీలించారు. రుణమాఫీ కానీ రైతుల ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక యాప్‌లో రైతుల వివరాలు నమోదు చేస్తూ వారి కుటుంబ సభ్యులతో సెల్ఫీ ఫొటోను ఆప్ లోడ్ చేశారు. ఆమె వెంట ఏఓ సుధారాణి, ఏఈఓ ప్రణయ్‌రెడ్డి ఉన్నారు.



యాదగిరిగుట్ట : బాహుపేటలో రైతుల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీఏ శాంతి నిర్మల

**కుంట్లగూడెంలో..**

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని కుంట్లగూడెం గ్రామంలో గురువారం రుణమాఫీ కాని రైతుల నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండలంలో కుటుంబ నమోదు కాని రైతులు సుమారు 1618మంది ఉన్నారని మండల వ్యవసాయ అధికారి ఎం.నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా నమోదుకు షెడ్యూల్‌ను విడుదల చేశారు. సెప్టెంబర్ 19వరకు నమోదు కార్యక్రమం మండలంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## 31న శని త్రయోదశి పూజలు

బీబీనగర్, ఆగస్టు 29 : ఈ నెల 31న శని త్రయోదశిని పురస్కరించుకొని మండలంలోని మహదేవ్‌పూర్ గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు (నవగ్రహ, శని పూజలు) నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ రుద్ర వెంకటేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని, పూజా కార్యక్రమాలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

## చౌటుప్పల్ నూతన సీఐగా మన్మథకుమార్

చౌటుప్పల్, ఆగస్టు 29 : చౌటుప్పల్ నూతన సీఐగా మన్మథకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఉప్పల్ స్టేషన్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన సీఐ అశోక్‌రెడ్డి సైబర్ క్రైమ్ రాచకొండకు వెళ్లారు.

## విద్యార్థులకు టీషర్ట్, వాటర్ బాటిళ్ల పంపిణీ



శ్రీనివాస్‌పురంలో వాటర్‌బాటిళ్లు అందిస్తున్న సంఘ మిత్ర స్వచ్ఛంద సేవా సంస్థ

ఆలేరురూరల్, ఆగస్టు 29 : మండలంలోని శ్రీనివాస్‌పురం ప్రాథమిక పాఠశాలలో సంఘమిత్ర స్వచ్ఛంద సేవాసంస్థ ఫౌండర్ బొట్ల సంపత్ సహకారంతో విద్యార్థులకు టీషర్ట్స్, వాటర్‌బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పరశురాములు, భాను, వాసు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 29 : గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని గుడిమల్కాపురం గ్రామంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మర్రిగూడ మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన పందిరి రాములు(59) బుధవారం మనవడు బారసాల కోసం చౌటుప్పల్ మండలం తంగడపల్లి గ్రామానికి వచ్చాడు. గురువారం ఉదయం తన లూనాపై తిరిగి ఇంటికి వెళ్తుండగా గుడిమల్కాపురం గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. రాములు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగన్ తెలిపారు.

## తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది



ఉపాధ్యాయుడు ఎం.రాంరెడ్డిని సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

మోత్కూరు, ఆగస్టు 29 : తెలుగు భాష భారతీయ సంస్కృతికి ప్రతీక అని, తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత, అవశ్యకత నేటి తరానికి ఉందని విశ్రాంత తెలుగు భాషా పండితురాలు యాదగిరి లక్ష్మి అన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమెతోపాటు తెలుగు భాషను బోధించి ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు తొగిటి మనోహరాచారి, వారాల యాదగిరి, క్రీడోపాధ్యాయుడు ఎం.రాంరెడ్డి, ఇటీవల బదిలీపై వెళ్లిన తెలుగు ఉపాధ్యాయులు గుమిడెల్లి వెంకన్నను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమం ప్రారంభంలో పాఠశాల ఇన్‌చార్జి హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ చిత్ర పటానికి, సరస్వతి విగ్రహానికి ప్రధానోపాధ్యాయులు దేవినేని అరవిందరాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బత్తిని రామకృష్ణ, జినుకల ప్రవీణ్, అక్కినపెల్లి వెంకటాచారి, జక్కుల రవి, ఆర్.వెంకటాచారి, సుధీర్‌కుమార్, దేవినేని మంజుల, స్వప్న, టి.ఉప్పలయ్య, శ్రావ్య, రేవతి, కవిత పాల్గొన్నారు.

## బావిలో పడి యువకుడి మృతి



పర్రెపాటి వెంకటేశ్ (ఫైల్)

అడ్డగూడూరు, ఆగస్టు 29 : బావిలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని లక్ష్మీదేవి కాల్వ గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు, ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన పర్రెపాటి వెంకటేశ్ (27)తన తల్లితో కలిసి రోజు మాదిరిగా తమ వ్యవసాయ బావి దగ్గరికి వెళ్లారు. బావిలో మోటర్ నడువకపోవడంతో వెంకటేశ్ బావిలోకి దిగి మోటరు కంట్రోల్ వాచర్‌ను అమరుస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. గమనించిన తన తల్లి లక్ష్మి ఆమె భర్త సైదులు, పక్క బావుల వారికి సమాచారం అందించడంతో వారు తాళ్లతో బయటికి తీయడంతో అప్పటికే మరణించాడు. ఉన్న ఒక్క కొడుకు చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. తన తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట దవాఖానకు తరలించారు.

**ఫ్రీజర్ బాక్స్ అందజేత**

అడ్డగూడూరు, ఆగస్టు 29 : మండలంలోని బొడ్డుగూడెం గ్రామానికి చెందిన చుక్క బాబు, చుక్క సందీప్ తమ సొంత ఖర్చులతో ఫ్రీజర్ బాక్స్‌ను గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయానికి అందించారు. గ్రామస్తులు ఎవరైనా దీనిని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొమ్ము సత్యనారాయణ, నాయకులు వెంపల్ల నర్సిరెడ్డి, చుక్క దేవయ్య, నాగేశ్‌నాయుడు, సమ్మెట స్వామి, మిడిదొడ్డి రాజయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

## షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

- ఆర్డీఓ, తాసీల్దార్ కార్యాలయాల ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా



మోత్కూరు : తాసీల్దార్ ఉపేందర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

మోత్కూరు, అగస్టు 29 : ప్రభుత్వం రైతులకు షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం మోత్కూరు తాసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ ఉపేందర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం బొల్లు యాదగిరి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి అనేక నిబంధనలు పెట్టి మూడు విడుతల్లో ఇప్పటి వరకు 50శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ వర్తింప చేయలేదని అన్నారు. రేషన్ కార్డు, పాసు పుస్తకం ప్రామాణికంగానే రైతు రుణమాఫీ చేస్తామని చెబుతున్నా ఆధార్ కార్డులో తప్పులు వంటి అనేక సాంకేతిక లోపాల పేరుతో రుణమాఫీ చేయలేదన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన పంట పెట్టుబడి సాయం రైతు బంధు రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమైనప్పుడు, ఇప్పుడు రుణమాఫీ డబ్బు ఎందుకు బ్యాంకు ఖాతాలో జమకాదని ప్రశ్నించారు. జూన్‌లో ఇవ్వాల్సిన పంట పెట్టుబడి సాయం రైతు భరోసా ఆగస్టు గడిచినా ఇవ్వడంలేదన్నారు. మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, పట్టణ కార్యదర్శి కూరపాటి రాములు, మండల కమిటీ సభ్యులు దడిపెల్లి ప్రభాకర్, పసునూరి చంద్రారెడ్డి, నాయకులు కురిమేటి యాదయ్య, మెతుకు అంజయ్య, కందుకూరి నర్సింహ, పిట్టల చంద్రయ్య, సైదులు, మాంద్ర చంద్రయ్య పాల్గొన్నారు.

**రెండు లక్షల రుణమాఫీలో ప్రభుత్వం విఫలం**

చౌటుప్పల్ : రూ.2లక్షల రుణమాఫీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దోనూరి నర్సిరెడ్డి అన్నారు. చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట గురువారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా రుణమాఫీ చేయాలన్నారు. అనంతరం ఆర్డీఓకు వినతి పత్రం సమర్పించారు. గంగాదేవి సైదులు, బూరుగు కృష్ణారెడ్డి, జల్లెల పెంటయ్య, మద్దెల రాజయ్య, గుంటోజు శ్రీనివాస చారి, సిర్పంగి స్వామి, దోడ యాదిరెడ్డి, బొడ్డుపల్లి వెంకటేశం, చీరిక సంజీవరెడ్డి, పల్లె మధుకృష్ణ, రాగీరు కిష్టయ్య, బోయిని ఆనంద్, పల్లె శివకుమార్ పాల్గొన్నారు.



చౌటుప్పల్ : ఆర్డీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు


**గుండాలలో..**

గుండాల : ఎటువంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని సీపీఎం మండల కార్యదర్శి మద్దెపురం రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా నిర్వహించారు. రేషన్ కార్డు నిబంధనలతో ప్రభుత్వం రైతులను మోసం చేయాలని చూస్తుందన్నారు. అనంతరం నాయబ్ తాసీల్దార్ నీలిమకు వినతి పత్రాన్ని అందజేశారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు పోతరబోయిన సత్యానారాయణ, అంజయ్య, ఎండీ ఖలీల్, బాలయ్య, లింగయ్య పాల్గొన్నారు.



గుండాల : నాయబ్ తాసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

## మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన శ్రవణ్‌కుమార్



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాల్య శ్రవణ్‌కుమార్, చిత్రంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

రామన్నపేట, ఆగస్టు 29 : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఆ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు కాల్య శ్రవణ్‌కుమార్ మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి గురువారం ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే బీఆర్‌ఎస్ నాయకురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ మంజూరు కావడంపట్ల ఆమెను కూడా కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు శ్రవణ్ కుమార్ తెలిపారు.

## నల్ల పోచమ్మ ఆలయంలో పంచామృతాభిషేకాలు



పంచామృతాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 29 : పట్టణ కేంద్రంలోని నల్ల పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా గురువారం పంచామృత అభిషేకాలు, యజ్ఞం నిర్వహించారు. ఆలయంలో గణపతి పూజ, సర్వతోభద్ర చతుష్షష్టి యోగిని, వాస్తు క్షేత్ర పాలక నవగ్రహ మండప పూజలు, మూల మంత్ర జపం, హోమం, ధ్యానాధివాసం, పుష్పాధివాసం, మంత్రపుష్పం కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పునః నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కట్కూరి పాండురంగం, గౌరవ అధ్యక్షుడు కొయ్యడ నరసింహ, గునిగంటి మల్లేశం, తడ వెంకటేశం, ఉపాధ్యక్షులు డబ్బికార్ సాయిశ్, భోగ చంద్రశేఖర్, మంగళపల్లి రాజా రమేశ్, ప్రధాన కార్యదర్శి బొడిగె లింగమ్ గౌడ్, కోశాధికారి మాటూరి రామకృష్ణ, నాయకులు శెట్టి శ్రీనివాస్, మక్తల పోచయ్య, చెరుకు అంజయ్య, వంగూరి పాండు, వంగూరి పెంటయ్య, చేరాల చిన్న నరసింహ, తండా రమేశ్, కిషన్, గురుగట్టి వెంకటేశం, నరసింహ గౌడ్, కటుకూరి నరహరి, ముప్పిడి శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

## వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకించాలి

- ఆవాజ్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జహంగీర్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జహంగీర్

చౌటుప్పల్, ఆగస్టు 29 : కేంద్రం ప్రభుత్వం తీసుకొస్తున్న వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకించాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జహంగీర్ అన్నారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని షాదీఖానలో గురువారం ఆవాజ్ ల్యాండ్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు అధికారాలను నిర్వీర్యం చేసే విధంగా సవరణ బిల్లు తేవడం సరైంది కాదన్నారు. ఏక పక్షంగా పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టిందని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ పాషా, గౌస్, లతీఫ్, రఫీ, ఖలీల్, సర్వర్, లతీఫ్‌ఖాన్, బడేసాబ్, రహీమ్ షరీఫ్, ఫయాజ్‌ఖాన్, సులేమాన్, రహీమ్, ఆవేజ్, జాఫర్‌ఖాన్, హాజీబాబా పాల్గొన్నారు.

## కారులో వచ్చి మెడలో గొలుసు చోరీ



చైన్ స్నాచర్ల కోసం సీసీ కెమెరాలో పరిశీలిస్తున్న పోలీసులు

మోత్కూరు, ఆగస్టు 29 : మండలంలోని అనాజిపురంలో గుర్తు తెలియని దుండగులు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళ మెడలోంచి మూడున్నర తులాల బంగారు గొలుసు దోచుకెళ్లిన ఘటన గురువారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన అసర్ల సోమక్క ఆమె భర్త మల్లయ్య తమ ఎక్స్‌ఎల్ ద్విచక్రవాహనంపై మోత్కూరు మండలంలోని ముశిపట్లలో ఉన్న తమ కూతురు వద్దకు వెళ్తున్నారు. అనాజిపురం నుంచి కల్మెకుంట మీదుగా ఉన్న మట్టి బాటపై వెళ్తున్న వారిని గమనించిన చైన్‌స్నాచర్లు కారులో నుంచి ఇద్దరు కిందికి దిగారు. ఎక్స్‌ఎల్ వాహనాన్ని ఆపి సోమక్క మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు గొలుసును లాక్కొని పర్యారయ్యారు. అప్పటికే సోమక్క ఆమె భర్త మల్లయ్య లబోదిబోమంటూ కేక వేసుకుంటూ కారును వెంబడించారు. అప్పటికే కారును వేగంగా నడుపుకుంటూ దుండగులు పరారయ్యారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దుండగుల ఆచూకీ కోసం పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు.

## 'కుక్కల బెడద నుంచి రక్షించాలి'



మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రవిశంకర్

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 29 : మున్సిపల్ పరిధిలోని తొమ్మిదో వార్డు మార్కండేయ నగర్, ప్రకాశ్‌నగర్ కాలనీలో కుక్కల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వాటి నుంచి రక్షించాలని కోరుతూ కాలనీకి చెందిన గుండేటి రవిశంకర్, విజయ్, శివ గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వీరారెడ్డికి వినతి పత్రం అందజేశారు. వీధి కుక్కల దాడిలో గాయపడుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతున్నదని భద్రావతి కాలనీలో అయిటిపాముల మహేందర్ కుమారుడు సుశాంత్ (రెండున్నర సంవత్సరాలు) ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్నాడని పేర్కొన్నారు. ఇప్పటికైనా కుక్కల బారి నుంచి రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.